సమస్యలుంటే చెప్పండి



వినాయకనగర్‌లో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా తమకు ఫోన్ ద్వారా చెప్పితే పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వినాయకనగర్‌లో ఆయన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఏఈ సునిల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాములు, వినాయకనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్దిరాములు, స్థానికులు నరసింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు డి. కృష్ణమూర్తి, గౌతమ్ కార్పొరేటర్ వెంట ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మూసాపేట్ ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులను శుక్రవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. వర్షపు నీరు, కలుషిత నీటి సరఫరా వల్ల అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా విషయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే జలమండలి అధికారులు కలుషిత నీటి సమస్యకు పరిష్కారం చూపడంతో రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయన్నారు. కార్యక్రమంలో ఏఈలు రంజిత్, వర్షిణి నాయకులు జిల్లా గోపాల్, బాలరాజు, యాదిలాల్, కృష్ణ, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామారావునగర్ వాసులు

అల్లాపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్ హిందూ శ్మశాన వాటిక కమిటీ సభ్యులు కార్పొరేటర్ సబీహ బేగంతో శుక్రవారం భేటీ అయ్యారు. రామారావు నగర్ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు జరిపించేందుకు కనీస సౌకర్యాలు లేవని, పలు అభివృద్ధి పనులు చేపట్టాలంటూ వినతి పత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తగా రెండు దహనవేదికలు, స్ట్రీట్ లైట్లు, పార్కింగ్ లైట్లు, వాచ్‌మన్ గది కల్పించేందుకు, శిథిలావస్థ కు చేరిన కార్యాలయపు గది నిర్మాణానికి, ప్రహరీ ఎత్తు పెంచేందుకు, స్నా నాల గదిలో టైల్స్ వంటి పనులకు నిధులు సమకూర్చేందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తెచ్చి మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, బీఆర్ఎస్ కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, నరసింహ మాస్టర్, రామిరెడ్డి, యేగిరాజ్ స్వామి, శివ పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి



గౌతమీనగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గౌతమీనగర్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శుక్రవారం ఎస్ఎఫ్ఐ సిబ్బంతో కలిసి పరిశీలించారు. గౌతమీనగర్‌లో డ్రైనేజీ పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉపేందర్, రామానంద్, జగన్, పాండూ నాయక్, భాగయ్య, ఆనంద్‌గౌడ్, సురేందర్‌నాయుడు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఎన్నాళ్లీ 'ఇన్‌చార్జీల పాలన'!

- పలు విభాగాలకు రెగ్యులర్ డైరెక్టర్లు లేక అకడమిక్స్‌పై కొరవడిన పర్యవేక్షణ
- నిలిచిన అభివృద్ధి పనులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు ఆర్నెళ్లుగా రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ లేరు. యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న డైరెక్టర్ పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి యూనివర్సిటీకి తరచుగా రాకపోవడంతో వర్సిటీలో పాలన పూర్తిగా గాడితప్పింది. ఇన్‌చార్జి వీసీ మాదిరిగానే కొన్ని డైరెక్టర్ పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు సైతం ముఖ్యమైన పనుల పట్ల అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిది నెలలుగా యూనివర్సిటీకి పాలకమండలి కూడా లేకపోవడంతో పూర్తిస్థాయి డైరెక్టర్లను నియమించేందుకు వీలు కావడం లేదని తెలుస్తోంది. దీంతో అకడమిక్స్‌పైనా, అభివృద్ధి పనులపైనా పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడింది. రూ. 5లక్షలకు పైబడి ఏ అభివృద్ధి పనిని చేపట్టాలన్నా అనుమతించే దిక్కు లేకుండా పోయింది. దీంతో వర్సిటీ అనుబంధ కళాశాలల్లో ఈవిద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన సుమారు రూ.200కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఓవైపు ఇబ్బడి ముబ్బడిగా కోర్సులు, విద్యార్థులు పెరగడం తో ఆయా కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేని దుస్థితి నెలకొంది.

ఇన్‌చార్జి బాధ్యతలతో కొందరిపై అదనపు భారం

జేఎన్‌టీయూలోని పలు విభాగాలకు డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి పోస్టుల్లో ఉన్న ప్రొఫెసర్లకే ఖాళీగా ఉన్న విభాగాలకు ఇన్‌చార్జిలుగా నియమించడంతో వారిపై అదనపు పనిభారం పడుతోంది. దీంతో కొన్ని తరగతుల విద్యార్థులకైనా పాఠాలు చెప్పేందుకు వారికి సమయం దొరకడం లేదు. మరోవైపు దశాబ్దాల పాటు అడ్మినిస్ట్రేషన్ పోస్టుల్లో ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని, ఒక్కసారి కూడా తమకు అవకాశం ఇవ్వడం లేదని మరికొందరు సీనియర్ ప్రొఫెసర్లను తరచుగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. యూనివర్సిటీలో ఇన్నోవేషన్ లెర్నింగ్ అండ్ టీచింగ్ (డిల్ట్) డైరెక్టరు క్రిష్ణమోహనరావు అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల విభాగం డిప్యూటీ డైరెక్టర్ సైదా నాయక్ కళాశాల పరీక్షల విభాగానికి ఇన్‌చార్జి అధికారిగా ఉన్నారు. యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్ష న్ సెల్(యూఐఐసీ) డైరెక్టర్ రజిని ఈసీఈ ఇన్‌చార్జి విభాగాధిపతిగా, గ్లోబల్ అలూమ్ని డైరెక్టర్ సురేశ్‌కుమార్ యూఐఐసీకి ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ అరుణకుమారి మహబూబాబాద్ జేఎన్‌టీయూకు నోడల్ అధికారిగా, అటానమస్ కాలేజెస్ అఫైర్స్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి పాలేరు జేఎన్‌టీయూ నోడల్ అధికారిగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్ శ్రీకాంత్.. ఫిజిక్స్ విభాగాధిపతిగా, జె-హబ్ డైరెక్టర్ శ్రీదేవి సైబర్ సెక్యూరిటీ విభాగం సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శోభారాణి ఫార్మసీ ఇన్‌చార్జి విభాగాధిపతిగా వ్యవహరిస్తున్నారు. అకడమిక్స్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ రమణకు అదే విభాగానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కీలకమైన క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని, మరింత కీలకమైన టీజీపీఎస్సీ పరీక్షలకు కన్వీనర్‌గా నియమించడంతో ఆయనకు క్షణం తీరికలేని పరిస్థితి నెలకొంది. ఐక్యూఏసీ, యూజీసీ-ఎంఎంటీటీసీ విభాగాలకు కూడా ఇన్‌చార్జి అధికారులనే నియమించారు. దీంతో ఆయా విభాగాల్లో విద్యార్థులకు, ఉద్యోగుల సమస్యలకు వెంటనే పరిష్కారాలు లభించడం లేదు. కొందరు అధికారులు తగినంత సమయం కేటాయించ లేక పోవడంతో సంబంధిత ఫైళ్లన్నీ నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

ఏళ్ల తరబడి పదవులకు దూరంగా కొందరు సీనియర్లు

అదనపు పనిభారంతో ఇబ్బంది పడుతున్న అధికారులను ఇన్‌చార్జి పదవుల నుంచి విముక్తి కల్పించాలని, ఎంతో కాలంగా ఒక్క పదవీ కూడా చేపట్టని సీనియర్ ప్రొఫెసర్లకు అవకాశాలు కల్పించాలని విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాలకమండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి అధికారులను నియమించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.



కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ. 35, వంకాయ రూ. 35, బెండకాయ రూ. 35, పచ్చి మిర్చి రూ. 35, బజ్జి మిర్చి రూ. 40, కాకరకాయ రూ. 20, బీరకాయ రూ. 38, క్యాబేజీ రూ. 25, బీన్స్ రూ. 45, క్యారెట్ రూ. 57, గోబి పువ్వు రూ. 23, దొండకాయ రూ. 28, చిక్కుడు కాయ రూ. 55, గోరు చిక్కుడు రూ. 28, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 45, ఆలుగడ్డ రూ. 36, కీర రూ. 13, దోసకాయ రూ. 25, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 25, కంద రూ. 55, ఉల్లిపొరక రూ. 45, ఉల్లిగడ్డ రూ. 44, మామిడి కాయ రూ. 15-20, అరటికాయ రూ. 8-9, చామగడ్డ రూ. 35, ముల్లంగి రూ. 5-6, చిలగడ దుంప రూ. 28, గుమ్మడికాయ రూ. 30, నిమ్మకాయలు రూ. 50-60, మునగ కాయలు రూ. 14-16, బొప్పాయి రూ. 40, పుట్టగొడుగులు రూ. 40, ఎండు మిర్చి రూ. 220, అల్లం రూ. 160, వెల్లుల్లి రూ. 400, చింతపండు రూ. 140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ. 100. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.

పేకమేడల నిర్మాణాలపై బల్దియా ఆరా

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి సిద్ధిఖ్‌నగర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో గ్రేటర్‌లో 100 గజాల్లోపు ఉన్న స్థలాల్లో పేకమేడలు నిర్మిస్తుండడంపై బల్దియా అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో మూసాపేట్ సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ, బాలజీనగర్ డివిజన్ల పరిధిలో 66, 88 గజాల్లో ఆరు, ఏడు అంతస్తులు నిర్మిస్తున్న వాటిని తక్షణమే నిలువరించాలని బల్దియా నుంచి ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలను ఆపేస్తే నిర్మాణదారుల నుంచి అధికారుల అవినీతి, అమ్యామ్యాల గురించి ఎక్కడ బయటపడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో లంచాలు తీసుకున్న అధికారులు బదిలీపై వెళ్లగా మనకేంటి? అంటుండగానే సార్.. క్షేత్రస్థాయిలో వెళ్తే అసలు విషయం మీకు అర్థం అవుతోందని చెప్పడంతో.. సరే దీనిపై ఏదో ఒకటి చేయాలని చర్చించుకున్నారు. పేక మేడలను ఆదిలోనే అడ్డుకోకపోతే భవిష్యత్తులో ప్రమాదాలకు కేరాఫ్ కేపీహెచ్‌బీగా నిలవడం ఖాయమని స్థానికులంటున్నారు. హాస్టల్స్ కోసం గల్లీల్లో ఒక్క కుటుంబం ఉండే స్థానంలో 70 నుంచి 80 మంది పిల్లలు ఉండడంతో వారి బైక్‌లు రోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో నివాసం ఉండే ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. బల్దియా కార్యాలయం నుంచి స్పెషల్ టీం వచ్చి గుర్తించక ముందే మూసాపేట్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, టీపీఎస్ అక్రమ నిర్మాణాలను నిలువరిస్తారా? లేదా అన్నది తెలియాలి.

వయోవృద్ధులకు 'సహృదయ క్లబ్'



మోతీనగర్ పార్కులోని వయోజనుల క్లబ్‌లో పాల్గొన్న ఆసక్తిపరులు

అల్లాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో మోతీనగర్ పార్కు ఆవరణలో శుక్రవారం 'సహృదయ' పేరిట వయోజనుల కోసం క్లబ్‌ను ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ల ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమాలతో పాటు, క్రమపద్ధతిలో వ్యాక్సినేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్, సామాజిక సందర్భాల్లో వారి భాగస్వామ్యం వంటి అంశాలతో వయోజనుల్లో సాధికారత పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు, ఇప్పటికే 20మంది సభ్యులుగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ఓ రెండు గంటలపాటు యోగ, మెడిటేషన్, చట్టాలు, పలు సంబంధిత అంశాలపై అవగాహన కార్యక్రమాలు, పాట్‌లక్ (ఎవరి వంటకం వారు తెచ్చుకుని మిగతా వారితో కలిసి భోజనం చేయడం) వంటి ఉల్లాసవంతమైన కార్యక్రమాలు ఉంటాయని 'యునైటెడ్ వే' ప్రతినిధి మహేశ్వరి తెలిపారు.

ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో నమ్మించి మోసం చేసిన ఆర్‌జే సంస్థపై తగిన చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరుతూ బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులు ప్రముఖులతో ప్రకటనలు ఇప్పించడంతో నారాయణ్‌ఖేడ్, ఘట్‌కేసర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఫామ్‌ల్యాండ్‌లను కొన్నామని తెలిపారు. సుమారు 600 మంది నుంచి రూ.150 కోట్లను నిర్వాహకులు వసూలు చేశారని ఆరోపించారు. 2020లో ఒక్కొక్కరం రూ.20 లక్షల నుంచి రూ.50లక్షల వరకు కట్టామని, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని ఆరోపించారు. వెంచర్ ఎండీ భాస్కర్‌గుప్తా, డైరెక్టర్ సుధారాణిలను తాము ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారని, అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. ఈ విషయమై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆర్‌జే సంస్థ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని కోరారు.

రేపు రెడ్డి సంఘం వనభోజనాలు

బాలానగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు బాలానగర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కే ఉపేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 8 నుంచి 4.30 గంటల వరకు కొంపల్లి వర్మగార్డెన్‌లోని శివాలయ గెస్ట్‌హౌజ్‌లో ఈ వేడుక ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పలు అంశాలలో పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. రెడ్డి కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కూకట్‌పల్లి ఏ బ్లాక్ నాయకుల సమావేశం

ఓల్డుబోయినపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కూకట్‌పల్లి ఏ బ్లాక్ నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ ఆర్ఆర్‌నగర్‌లోని తన నివాసంలో నేతలతో మాట్లాడి కూకట్‌పల్లిలో ప్రభుత్వ పథకాలు, పార్టీ శ్రేణుల వ్యవహారంపై నేతలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం మాటున ముప్పు

- 15 రోజులైనా పట్టించుకోని అధికారులు
- ప్రమాదపు అంచుల్లో ప్రజలు



విద్యుత్ స్తంభం కిందినుంచి పైకి ఎగసి పడుతున్న నీటిని చూపిస్తున్న స్థానికుడు

బాలానగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ వినాయకనగర్‌లో ఓ భవనం ముందు ఉన్న విద్యుత్ స్తంభం కిందనుంచి మంజీరా నీరు పైకి ఎగిసి పడుతోంది. 15 రోజుల నుంచి ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఎప్పుడేమి ముప్పు వాటిల్లు తుందో, ఎవరికి షాక్ కొడుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. నిత్యం ఈ రోడ్డులో స్కూల్ విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాదాచారాలు నిత్యం రాక పోకలు సాగిస్తుంటారు. రెండు నెలల క్రితం కొత్తగా కట్టిన అపార్టుమెంట్ కోసం విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ కింద పైప్‌లైన్ కనెక్షన్ ఉందని స్థానికులు చెప్పినా పట్టించుకోకుండా విద్యుత్ స్తంభం వేశాడని స్థానికులు చెబుతున్నారు. అనుకున్నట్టుగానే విద్యుత్ స్తంభం అడుగు నుంచి నీరు చిమ్ముతోందని స్థానికులు అంటున్నారు. నాలుగు రోజుల నుంచి ఈ సమ స్య ఉన్నప్పటికీ జలమండలి, విద్యుత్ అధికారులు, కాంట్రాక్టరు పట్టించుకోవడంలేదు. జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

డిసెంబరు 21 నుంచి స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలు



స్విమ్మింగ్ పురుషుల, మహిళల జట్లకు ఎంపికైన వర్సిటీ క్రీడాకారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ యూనివర్సిటీస్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు జేఎన్‌టీయూ పురుషుల, మహిళల జట్లకు శుక్రవారం సెలక్షన్స్ నిర్వహించారు. తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డిసెంబరు 21నుంచి 23వ తేదీ వరకు స్విమ్మింగ్ చాంపియన్ షిప్ ఉంటుందని స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్ తెలిపారు. జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్లో మెన్ అండ్ ఉమెన్‌కు జరిగిన సెలక్షన్స్‌ను ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్ పర్యవేక్షించారు. అలాగే, వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో డిసెంబరు 10 నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ తరఫున పాల్గొనే టేబుల్ టెన్నిస్ జట్టును కూడా సిద్ధం చేసినట్టు అశోక్ వెల్లడించారు.

జేఎన్‌టీయూలో 'డిజిటల్ ఫ్రంటియర్' వర్క్‌షాప్

- నకిలీ ఈ-మెయిల్స్, లింక్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్న నిపుణులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ ఆధ్వర్యంలో డిజిటల్ ఫ్రంటియర్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంటర్‌సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రతినిధి జయకృష్ణ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో సమాచార భద్రత కోసం నకిలీ ఈమెయిల్స్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం చాలా ముఖ్యమన్నారు. బహిరంగ వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించకుండా ఉండాలని, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్లను ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వర్క్‌షాప్‌నకు డైరెక్టర్ శ్రీదేవి సంధానకర్తగా వ్యవహరించారు. జేఎన్‌టీయూ అఫిలియేటెడ్ కళాశాలల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్



యాంటీ ర్యాగింగ్ ర్యాలీలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాగింగ్ వలన కలిగే ప్రతికూల ఫలితాలపై సీనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశ్యమని, కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చేందుకు విద్యార్థులు, ఆచార్యులు కృషిచేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి.నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బీటెక్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ కోఆర్డినేటర్ పార్వతి, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

దేశం క్రీడల్లో వెనకబడడం శోచనీయం

- వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య



ఓవరాల్ చాంపియన్లుగా నిలిచిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ జానయ్య తదితరులు

రాజేంద్రనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అధిక జనాభా ఉన్న భారతదేశం క్రీడల్లో వెనకబడి ఉండడం శోచనీయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 11 కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్లుగా బాల బాలికల విభాగంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నిలిచింది. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో బాలురు, బాలికల విభాగంలో అశ్వారావుపేటకు చెందిన కె.అనిల్ కుమార్, ఎం.రచన చాంపియన్‌లుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ అన్ని విద్యా విధానాలు క్రీడల ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నప్పటికీ దానికి తగిన ఆచరణ ఉండడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో ఐక్యత, పాజిటివ్ ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జె.సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి, డాక్టర్ ప్రశాంత్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్.. ఇబ్బందిలో వాహనదారులు



గాయత్రీనగర్ కూడలి వద్ద ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

అల్లాపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ ప్రధాన రహదారిలో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. మోతీనగర్, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల నుంచి హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రయాణికులు తాము విలువైన సమయాన్ని కోల్పోతున్నామని వాపోతున్నారు. రోడ్డు సైడ్ చిరు వ్యాపారాలు, వైన్‌షాపు వద్ద వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- టీచర్లు, ఆయాలు లేక అవస్థలు
- బాలానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పని అద్దె కష్టాలు
- పట్టించుకోని ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించాలంటున్న సిబ్బంది

బాలానగర్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మండలంలోని హస్మత్‌పేట్ సెక్టార్‌లో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నాయి. సెక్టార్ పరిధిలో మొత్తం 29అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో కొన్ని కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత ఉంది. ఓల్డుబోయినపల్లి అంజయ్యనగర్ అంగన్ వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్ రిజైన్ చేయడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా నిర్వహిస్తోంది. హస్మత్‌పేట(12,13) కేంద్రాల్లో టీచర్లు ఆయాల కొరత ఉంది. కార్మికనగర్ అంగన్‌వాడీ టీచరు, ఆయా లేక పోవడంతో ఆ సెంటర్‌ను మరో సెంటర్‌కు అప్పగించారు. 29 అంగన్‌వాడీ కేంద్రాల్లో 17కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 9కేంద్రాలు కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు.

వెంటాడుతున్న అద్దె కష్టాలు

అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె కష్టాలు వెంటాడుతున్నాయి. కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లింపులపై దృష్టి సారించక పోవడంతో అద్దె బకాయిలు పేరుకు పోతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. అద్దె విషయమై ఇంటి యజమానుల వేధింపులు తట్టుకోలేక తమకు వచ్చే జీతంలోని అద్దె బకాయిలు చెల్లించి ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అంటున్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటగ్యాస్ సమస్య ఉందని ఒక్కో కేంద్రానికి రెండు గ్యాస్ సిలిండర్లు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, ప్రతీ కేంద్రానికి రెండు వంటగ్యాస్ సిలిండర్లు, ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని వారంతా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆహారం వడ్డిస్తున్న ఆయా



ఫిరోజ్‌గూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

గ్యాస్ సిలిండర్‌కూ ఉంటుంది గడువు

● గడువు తీరిన సిలిండర్లతోనే ప్రమాదాలు
● అవగాహన లేకుండా ఉపయోగిస్తున్న ప్రజలు

రాయదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మనం కొత్త వస్తువు కొన్నపుడు అది పనిచేసే విధానాన్ని పూర్తిగా తెలుసుకునేందుకు తప్పనిసరిగా వస్తువుతో పాటు అందించే సూచనల పుస్తకం (మ్యాన్యువల్ బుక్)ను పూర్తిగా చదవాలి. కానీ మనలో చాలా మంది అదేమి పట్టించుకోకుండా నేరుగా వస్తువులను వాడుతుంటాం. మన నిత్య జీవితంలో వంటలో భాగమైన గ్యాస్ సిలిండర్ గురించి కూడా పూర్తి విషయాలు తెలియకుండానే వాడేస్తున్నారు. నిత్యం వాడే అనేక వస్తువులు, ఇతర వాటికి ఉన్నట్టే గ్యాస్ సిలిండర్‌కు కూడా గడువు తేది ఉంటుందన్న విషయం దానిని రోజు ఉపయోగించే చాలా మందికి తెలియదు. గృహ, వాణిజ్య, హోటళ్ల, రెస్టారెంట్లతో పాటు పలు అవసరాల కోసం గ్యాస్ సిలిండర్లు వాడుతున్నా వాటి గడువు తేదీని పట్టించుకునే వారు చాలా తక్కువ. గ్యాస్ సరఫరా చేసే వ్యక్తి వచ్చి సిలిండర్‌ను అందించగానే అతని ఇచ్చే రసీదును, ఎంత డబ్బు తీసుకుంటున్నాడు అన్న విషయాన్ని మాత్రమే గమనిస్తున్నారే తప్పా ఇచ్చిన సిలిండర్ గడువు తేదీ ఉన్నదా లేదా అయిపోయిందా లేక లీకేజీ ఏమైన అవుతుందా అన్న విషయమే తక్కువ మంది గమనిస్తున్నారని నిపుణులు అంటున్నారు. ఒకవేళ గడువు తేదీ అయిపోయినా, లీకేజీ ఉన్న సిలిండర్‌ను ఉపయోగిస్తే ప్రమాదాన్ని పక్కన ఉంచుకున్నట్లేనని, 90 శాతం ప్రమాదాలకు అవే కారణమని వారు అంటున్నారు.



గడువు తేదీలను గుర్తించండి ఇలా

గ్యాస్ సిలిండర్‌పై ఉన్న మూడు ఇనుప దిమ్మెలపై రాసిన ఇంగ్లిష్ అక్షరాలను, సంకెలను ఎవరు పట్టించుకోరు. కానీ విషయమంతా వాటిలోనే దాగుంది. ఆ సిలిండర్ ఎప్పుడు తయారైంది. ఎంత గ్యాస్ అందులో నిక్షిప్తమై ఉంది. గడువు తేదీ ఎప్పటి వరకు ఉంది అన్న వివరాలన్నీ ఈ సంఖ్యలు, అక్షరాలు తెలియజేస్తాయి. సిలిండర్ గడువు తేదీ ఏ, బి, సి, డి అక్షరాలతో సూచిస్తారు. సంవత్సరాల కాలాన్ని మూడు త్రైమాసికాలుగా విభజిస్తారు. అందులో..

● ఏ- జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలను మొదటి త్రైమాసికంగా, దీనిని ఏ అక్షరంతో సూచిస్తారు.

● బి- ఏప్రిల్, మే, జూన్ నెలలను రెండో త్రైమాసికంగా, దీనిని బి అక్షరంతో సూచిస్తారు.

● సి- జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలను మూడో త్రైమాసికంగా విభజించి, సి అక్షరంతో సూచిస్తారు.

● డి- అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలను చివరి త్రైమాసికంగా విభజించి డి అనే అక్షరంతో సూచిస్తారు.

ఉదాహరణకు సిలిండర్‌పై సి-26 అని రాసి ఉంటే దాని గడువు సెప్టెంబరు 2026వ సంవత్సరం వరకు మాత్రమే ఉందని గమనించాలి. ఆ గడువు దాటితే, సిలిండర్ గడువు తేదీ అయిపోయినట్లు గుర్తించి అటువంటి సిలిండర్‌ను వాడకుండా సంబంధిత డీలర్‌కు తిరిగి ఇచ్చేయాలి.

సిలిండర్ వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

గ్యాస్ సిలిండర్ డెలివరీ తీసుకునేటప్పుడు ముఖ్యంగా గడువు తేదీని గమనించాలి. ఒకవేళ గడువు తేదీని తెలియజేసే అక్షరాలపై ఏదైన స్టిక్కర్లు అంటించి ఉండడం, రంగులు వేసి కొత్తగా రాసినట్లు అనిపిస్తే అటువంటి సిలిండర్‌ను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. గ్యాస్ సిలిండర్‌కు ఉన్న సీల్ స్థితిని తప్పకుండా పరిశీలించాలి. ఒక్కొక్కసారి ఆ సీల్ మామూలుగా అంటించి వినియోగదారులకు అందించే అవకాశం ఉంది. అటువంటి వాటి వలన గ్యాస్ లీకేజీలు ఏర్పడుతాయి.

● గ్యాస్ సిలిండర్ గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా వేరువేరుగా తయారు చేయడం జరుగుతుంది. కావున వేటి కోసం తయారు చేసింది వాటి కోసమే ఉపయోగించాలి. ఖాళీ సిలిండర్‌లను ఎక్కువ రోజులు ఇంట్లో పెట్టుకోవడం వలన కూడా అనార్థాలు జరిగే అవకాశం ఉంది. కావున వీలైనంత త్వరగా సిలిండర్‌లను డీలర్‌లకు తిరిగి ఇచ్చేయాలి.


పతకాలు సాధించిన విద్యార్థులు

నవోదయ విద్యార్థులకు అరుదైన గౌరవం

రాయదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నవోదయ విద్యాలయానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, ఒలంపిక్ పతక విజేత అభినవ్ బింద్ర విచ్చేసి థాయిలాండ్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన నవోదయ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభినవ్ బింద్ర విద్యార్థులతో ముచ్చటించారు. వారికి పారా స్పోర్ట్స్‌లో పతకాలు సాధించటానికి, మరిన్ని విజయాలు సాధించడానికి మెళకువలు చెప్పారు. నవోదయలో చదువుతున్న విద్యార్థులు పారా స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరచడానికి తగిన శిక్షణ, వసతులు ఏర్పాట్లు చేస్తున్న నవోదయ విద్యాలయ సమితి తెలిపింది.


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం

గచ్చిబౌలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం మసీద్‌బండలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా రిటర్నింగ్ అధికారి సుభాష్‌చందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ముగుస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో బూత్ అధ్యక్షుల నియామకం ఉంటుందని, వారిని ఎన్నుకునే ప్రక్రియా విధానం గురించి వివరించారు. కార్యకర్తలకు ప్రజలకు ఎవరు అందుబాటులో ఉంటారో అలాంటి వారిని బూత్ అధ్యక్షులుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేంద్రరావు, కోకన్వీనర్ మణి భూషణ్, ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, బాల్ద అశోక్, వసంత్‌కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులుసాగర్, కృష్ణముదిరాజ్, నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్-1, 2లో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి ప్రశాంత్‌నగర్‌కాలనీ వాసుల సమస్యలు తీరుస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, తదితరులు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు ప్రధాన రహదారిలో వేసిన సీసీ రోడ్డును కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపుల అంచుల వరకు మట్టి వేయాలని, వాటర్ క్యూరింగ్ బాగా చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్‌అలీమున్నా, రాజిరెడ్డి, పోశెట్టిగౌడ్, వాలి నాగేశ్వరరావు, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఐదుగురికి రూ.20900 మంజూరయ్యాయి. వారికి మంజూరైన చెక్కులను గాంధీ శుక్రవారం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థికసాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్, ప్రసాద్, అనిల్‌రెడ్డి, రాంచందర్, శ్రీహరి, పూర్ణ, పద్మ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


చంద్రయ్య

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి సొంత గ్రామానికి బయలు దేరిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరికి చెందిన చంద్రయ్య(26) నిజాంపేటలోని నారాయణ కళాశాలలో పనిచేస్తు కళాశాలలోనే ఉండేవాడు. అతడిని పనినుంచి అక్టోబరులో తొలగించారు. దీంతో అతను అక్టోబరు 30న కళాశాల నుంచి ఇంటికి బయలు దేరినట్లు కళాశాల ఏఓ దుర్గాప్రసాద్ చంద్రయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడు ఇంటికి చేరక పోవడంతో కుటుంబ సభ్యులు చంద్రయ్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఎక్కడ వెతికిన ఆచూకీ తెలియక పోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

మియాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మంజునాథ్ వైన్స్ వద్ద ఈ నెల 19న రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లింకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మియాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు, దూరాన్ని తగ్గించేందుకు సీసీ రోడ్లు, లింకు రోడ్లు నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం మియాపూర్ డివిజన్‌లోని ఐడీఏ బొల్లారం ప్రధాన రహదారి నుంచి మక్తామహబూబ్‌పేట గ్రామం వరకు సుమారు రూ.85 లక్షలతో లింకు రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేపీనగర్ నుంచి మక్తామీదుగా బొల్లారం రోడ్డుకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని దీనిని గుర్తించి సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు.

ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రజలకు దూరం తగ్గడం, ట్రాఫిక్ సమస్య లేకపోవడంతో పాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో వేగంగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అన్ని వేళ్లలో అందుబాటులో ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లింకురోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, తదితరులు

రేపు సాయిదత్త గణపతి ఆలయంలో రుద్రహోమం

రాయదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఈ నెల 24న రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ధర్మగారి రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6.30 నుంచి గణపతి పూజ, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అడ్డగుట్ట, వాటర్‌ట్యాంక్ ప్రాంతం, శాతవాహన కాలనీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

గచ్చిబౌలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తారానగర్ తుల్జాభవాని ఆలయం వద్ద శుక్రవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ హాజరై అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దేశం క్రీడల్లో వెనకబడడం శోచనీయం

● వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అధిక జనాభా ఉన్న భారతదేశం క్రీడల్లో వెనకబడి ఉండడం శోచనీయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ జానయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 11 కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్లుగా బాల బాలికల విభాగంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నిలిచింది. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో బాలురు, బాలికల విభాగంలో అశ్వారావుపేటకు చెందిన కె.అనిల్ కుమార్, ఎం.రచన చాంపియన్‌లుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ అన్ని విద్యా విధానాలు క్రీడల ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నప్పటికీ దానికి తగిన ఆచరణ ఉండడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో ఐక్యత, పాజిటివ్ ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జె.సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి, డాక్టర్ ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఓవరాల్ చాంపియన్లుగా నిలిచిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ జానయ్య తదితరులు

వయోవృద్ధులకు 'సహృదయ క్లబ్'


మోతీనగర్ పార్కులోని వయోజనుల క్లబ్‌లో పాల్గొన్న సభ్యులు

అల్లాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో మోతీనగర్ పార్కు ఆవరణలో శుక్రవారం 'సహృదయ' పేరిట వయోజనుల కోసం క్లబ్‌ను ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ల ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమాలతో పాటు, క్రమపద్ధతిలో వ్యాక్సినేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్, సామాజిక సందర్భాల్లో వారి భాగస్వామ్యం వంటి అంశాలతో వయోజనుల్లో సాధికారత పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు, ఇప్పటికే 20మంది సభ్యులుగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి ఓ రెండు గంటలపాటు యోగ, మెడిటేషన్, చట్టాలు, పలు సంబంధిత అంశాలపై అవగాహన కార్యక్రమాలు, పాట్‌లక్ (ఎవరి వంటకం వారు తెచ్చుకుని మిగతా వారితో కలిసి భోజనం చేయడం) వంటి ఉల్లాసవంతమైన కార్యక్రమాలు ఉంటాయని 'యునైటెడ్ వే' ప్రతినిధి మహేశ్వరి తెలిపారు.

జేఎన్‌టీయూలో యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాగింగ్ వలన కలిగే ప్రతికూల ఫలితాలపై సీనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని, కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చేందుకు విద్యార్థులు, ఆచార్యులు కృషిచేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బీటెక్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ కోఆర్డినేటర్ పార్వతి, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.


శిల్పారామంలో జరుగుతున్న లోక్‌మంథన్ కార్యక్రమానికి వెళ్లే దారిలో హైటెక్ సిటీ వద్ద ట్రాఫిక్ జామ్



సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో నమ్మించి మోసం చేసిన ఆర్‌జే సంస్థపై తగిన చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరుతూ బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులు ప్రముఖులతో ప్రకటనలు ఇప్పించడంతో నారాయణ్‌ఖేడ్, ఘట్‌కేసర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఫామ్‌ల్యాండ్‌లను కొన్నామని తెలిపారు. సుమారు 600 మంది నుంచి రూ.150 కోట్లను నిర్వాహకులు వసూలు చేశారని ఆరోపించారు. 2020లో ఒక్కొక్కరం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కట్టామని, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని ఆరోపించారు. వెంచర్ ఎండీ భాస్కర్‌గుప్తా, డైరెక్టర్ సుధారాణిలను తాము ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారని, అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. ఈ విషయమై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆర్‌జే సంస్థ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని కోరారు.

జేఎన్‌టీయూలో ఎన్నాళ్లీ 'ఇన్‌చార్జీల పాలన'!

● పలు విభాగాలకు రెగ్యులర్ డైరెక్టర్లు లేక అకడమిక్స్‌పై కొరవడిన పర్యవేక్షణ
● నిలిచిన అభివృద్ధి పనులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు ఆర్నెళ్లుగా రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ లేరు. యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న డైరెక్టర్ పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి యూనివర్సిటీకి తరచుగా రాకపోవడంతో వర్సిటీలో పాలన పూర్తిగా గాడితప్పింది. ఇన్‌చార్జి వీసీ మాదిరిగానే కొన్ని డైరెక్టర్ పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు సైతం ముఖ్యమైన పనుల పట్ల అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిది నెలలుగా యూనివర్సిటీకి పాలకమండలి కూడా లేకపోవడంతో పూర్తిస్థాయి డైరెక్టర్లను నియమించేందుకు వీలు కావడం లేదని తెలుస్తోంది. దీంతో అకడమిక్స్‌పైనా, అభివృద్ధి పనులపైనా పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడింది. రూ. 5లక్షలకు పైబడి ఏ అభివృద్ధి పనిని చేపట్టాలన్నా అనుమతించే దిక్కు లేకుండా పోయింది. దీంతో వర్సిటీ అనుబంధ కళాశాలల్లో ఈవిద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన సుమారు రూ.200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఓవైపు ఇబ్బడి ముబ్బడిగా కోర్సులు, విద్యార్థులు పెరగడంతో ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్థితి నెలకొంది.

కొందరిపై అదనపు భారం

జేఎన్‌టీయూలోని పలు విభాగాలకు డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి పోస్టుల్లో ఉన్న ప్రొఫెసర్లకే ఖాళీగా ఉన్న విభాగాలకు ఇన్‌చార్జిలుగా నియమించడంతో వారిపై అదనపు పనిభారం పడుతోంది. దీంతో కొన్ని తరగతుల విద్యార్థులకైనా పాఠాలు చెప్పేందుకు వారికి సమయం దొరకడం లేదు. మరోవైపు దశాబ్దాల పాటు అడ్మినిస్ట్రేషన్ పోస్టుల్లో ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని, ఒక్కసారి కూడా తమకు అవకాశం ఇవ్వడం లేదని మరికొందరు సీనియర్ ప్రొఫెసర్లను తరచుగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. యూనివర్సిటీలో ఇన్నోవేషన్ లెర్నింగ్ అండ్ టీచింగ్ (డిల్ట్) డైరెక్టరు క్రిష్ణమోహనరావు అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల విభాగం డిప్యూటీ డైరెక్టర్ సైదానాయక్ కళాశాల పరీక్షల విభాగానికి ఇన్‌చార్జి అధికారిగా ఉన్నారు. యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్(యూఐఐసీ) డైరెక్టర్ రజిని ఈసీఈ ఇన్‌చార్జి విభాగాధిపతిగా, గ్లోబల్ అలూమ్ని డైరెక్టర్ సురేశ్‌కుమార్ యూఐఐసీకి ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ అరుణకుమారి మహబూబాబాద్ జేఎన్‌టీయూకు నోడల్ అధికారిగా, అటానమస్ కాలేజెస్ అఫైర్స్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి పాలేరు జేఎన్‌టీయూ నోడల్ అధికారిగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్ శ్రీకాంత్.. ఫిజిక్స్ విభాగాధిపతిగా, జె-హబ్ డైరెక్టర్ శ్రీదేవి సైబర్ సెక్యూరిటీ విభాగం సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శోభారాణి ఫార్మసీ ఇన్‌చార్జి విభాగాధిపతిగా వ్యవహరిస్తున్నారు. అకడమిక్స్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్వీ రమణకు అదే విభాగానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కీలకమైన క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని, మరింత కీలకమైన టీజీపీఎస్సీ పరీక్షలకు కన్వీనర్‌గా నియమించడంతో ఆయనకు క్షణం తీరికలేని పరిస్థితి నెలకొంది. ఐక్యూఏసీ, యూజీసీ-ఎంఎంటీటీసీ విభాగాలకు కూడా ఇన్‌చార్జి అధికారులనే నియమించారు. దీంతో ఆయా విభాగాల్లో విద్యార్థులకు, ఉద్యోగుల సమస్యలకు వెంటనే పరిష్కారాలు లభించడం లేదు. కొందరు అధికారులు తగినంత సమయం కేటాయించలేక పోవడంతో సంబంధింత ఫైళ్లన్నీ నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.


జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

పదవులకు దూరంగా కొందరు సీనియర్లు

అదనపు పనిభారంతో ఇబ్బంది పడుతున్న అధికారులను ఇన్‌చార్జి పదవుల నుంచి విముక్తి కల్పించాలని, ఎంతోకాలంగా ఒక్క పదవీ కూడా చేపట్టని సీనియర్ ప్రొఫెసర్లకు అవకాశాలు కల్పించాలని విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాలకమండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి అధికారులను నియమించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో

షాడో కార్పొరేటర్లదే హవా!

- అధికారం ఒకరిది వ్యవహారం మరొకరిది
- కనిపించని మహిళా కార్పొరేటర్లు
- మహిళా రిజర్వేషన్లకు తూట్లు



కుత్బుల్లాపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవచేస్తారని కోటి ఆశలతో ఓట్లేసి గెలిపించుకున్న మహిళా కార్పొరేటర్లు కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కనిపించడం మానేశారు. వారిని ఇంటికే పరిమితం చేసి వారి భర్తలు, తనయులు కార్పొరేటర్లుగా చలామణి అవుతున్నారు. ఈ సర్కిళ్ల పరిధిలో ఎనిమిది డివిజన్లు ఉన్నాయి. వీటిలో గాజులరామారం, జగద్గిరిగుట్ట, రంగారెడ్డినగర్, చింతల్, సూరారం, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్లు ఉన్నాయి. చింతల్ కార్పొరేటర్‌గా రషీదాబేగం, సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా హేమలతారెడ్డి, కుత్బుల్లాపూర్ డివిజన్‌కు కూన పారిజాతా, జీడిమెట్ల డివిజన్‌కు తారాచంద్రారెడ్డిలు ఎన్నికయ్యారు.

ఎన్నికైన కొత్తలో ప్రజలకు అందుబాటులో ఉన్నా, గత కొంతకాలంగా వీరు పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. డివిజన్ల పరిధిలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కనీసం వీరు ముందుకు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కిల్ కార్యాలయాల్లోని ఏ అధికారికి కూడా ఈ మహిళా కార్పొరేటర్ల పేర్లు కూడా తెలియదు. బస్తీలు, కాలనీల్లో జరిగే కార్యక్రమాల్లో వీరి భర్తలు, కుమారులే ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. మహిళా కార్పొరేటర్లను బయటకు రాకుండా ఇంటికి పరిమితం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

చింతల్ డివిజన్ పరిధిలో రషీదాబేగం భర్త మహ్మద్ రఫీ, సుభాష్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ హేమలతారెడ్డి భర్త జి.సురేష్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ పారిజాతా భర్త కేఎం గౌరీష్, జీడిమెట్ల డివిజన్‌లో కార్పొరేటర్ కుమారుడు భరత్‌సింహారెడ్డి కార్పొరేటర్లుగా చలామణి అవుతున్నారు.

అధికారిక కార్యక్రమాల్లో...

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఉన్న మహిళా కార్పొరేటర్‌ల స్థానంలో షాడో కార్పొరేటర్లు చలామణి అవుతున్న వారి భర్తలు, కుమారులు అధికారిక, అనధికారిక ప్రారంభోత్సవాలు, సమావేశాలలో పాల్గొంటున్నారు. మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించి సీట్లు కేటాయిస్తే గెలిచిన మహిళా కార్పొరేటర్లను వంటింటికి పరిమితం చేసి, ప్రజలకు దూరంగా ఉంచడం ఎంతవరకు సబబని ఓట్లేసి గెలిపించిన ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా కార్పొరేటర్లను ప్రజల్లోకి వచ్చి సేవ చేసే విధంగా ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. షాడో కార్పొరేటర్లుగా పనిచేస్తున్న వ్యక్తులను కట్టడి చేసి సమాజానికి మంచి సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది.





జైరాజ్ ఇస్పాత్ పక్కన ఖాళీ స్థలం

అభివృద్ధి ముసుగులో ప్రభుత్వ స్థలాల కబ్జా

- పట్టించుకోని టీజీఐఐసీ, ఐలా అధికారులు
- సొంత జాగీర్‌లా వ్యవహరిస్తున్న పరిశ్రమల నిర్వాహకులు

జీడిమెట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలో కోట్ల రూపాయాల విలువ చేసే ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కులు అభివృద్ధి ముసుగులో కొన్ని పరిశ్రమల కబ్జాలో ఉన్నాయి. నేడు వీటి విలువ కోట్లలో పలుకుతుంది. టీజీఐఐసీ, ఐలా అధికారులు గతంలో ఖాళీగా ఉన్న స్థలాలను గ్రీనరీ అభివృద్ధి కోసమని కొన్ని పరిశ్రమల యాజమాన్యాల ఆధీనంలోకి ఇచ్చారు. వాటిని అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులో ఉంచాల్సిన నిర్వాహకులు పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకుండా తమ సొంతానికి వాడుకుంటున్నారని కొందరు పారిశ్రామికవేత్తలు ఆరోపిస్తున్నారు. పారిశ్రామికవాడల్లో ఖాళీ స్థలాలు కనిపిస్తే వేలం వేసి విక్రయిస్తున్న టీజీఐఐసీ, ఐలా అధికారులు ఈ స్థలాలను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి చేసిన పార్కుల్లోకి ప్రతి ఒక్కరూ వెళ్లవచ్చు. కానీ పరిశ్రమల నిర్వాహకులు ఈ స్థలం తమదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఖాళీ స్థలాలపై దృష్టిపెట్టి, ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

జీడిమెట్ల పారిశ్రామికవాడలో గతంలో ఖాళీగా ఉన్న స్థలాలను పక్కన ఉన్న కంపెనీలకు గ్రీనరీ అభివృద్ధి కోసం ఇచ్చిన మాట వాస్తవమే. నేడు వాటి విలువ కోట్లలో ఉంది. వాటిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. గురువారం అన్ని స్థలాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించామని చెప్పారు. గ్రీనరీకి కాకుండా ఇతరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవు. వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

\- నజీర్, ఐలా కమిషనర్, జీడిమెట్ల



టీజీఐఐసీ ప్రభుత్వ స్థలాలు

మీకోసం

కుత్బుల్లాపూర్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు.

పరిపాలన విభాగం	ఫోన్ నంబర్లు
1. ఎల్.పీ.మల్లయ్య, డిప్యూటీ కమిషనర్	6309529286
2. ఏ.హరిబాబు, సూపరింటెండెంట్	9000994012
3. సునందిని, సూపరింటెండెంట్	8008433878
4. నీలిమ, సీనియర్ అసిస్టెంట్	9989891050
ఇంజనీరింగ్ విభాగం	
5. కిష్టప్ప, ఈఈ	9849906766
6. రూపాదేవి, డీఈ	9849008080
7. శిరీషా, డీఈ	9000115410
8. లక్ష్మణ్‌రావు, డీఏఓ	9505507834
9. కళ్యాణ్, ఏఈ	7995077953
10. తిరుపతి, ఏఈ	7337557254
11. సంపత్, ఏఈ	7995077961
టౌన్‌ప్లానింగ్ విభాగం	
12. రమేష్, ఏసీపీ	9154799124
13. తుల్జాసింగ్, టీపీఎస్	9959542371
రెవెన్యూ విభాగం	
14. నర్సింగరావు, ఏఎంసీ	8978904128
15. కె.జవహర్‌లాల్ సూపరింటెండెంట్	9000994018
16. కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్	9177701920
17. ఎం.వాజిద్, సీనియర్ అసిస్టెంట్	9989930315
18. బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్	9440135076
19. రాజశేఖర్, బిల్ కలెక్టర్	9676390810
20. రాజేష్, బిల్ కలెక్టర్	8341114140
21. రవి, బిల్ కలెక్టర్	8185042557
యూసీడీ విభాగం	
22. హరిప్రియా, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్	6309919063
23. సాయికృష్ణ, యూసీడీ	9553431321
24. కనకమలు, సీఓ	9908978143
25. పాపన్నగౌడ్, సీఓ	9182499400
26. కిషోర్‌కుమార్	9966456202
శానిటేషన్ విభాగం	
27. డాక్టర్ మమత, ఏంఓహెచ్	6305471334
28. గజేందర్‌బాబు, ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్	9000994023
29. జి.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్	8008060538
30. మహ్మదా బేగం, శానిటరీ జవాన్	9949313214
31. జిలానీ పాషా, శానిటరీ జవాన్	7702775233
32. సి.చందర్, శానిటరీ జవాన్	9394819242
ఎలక్ట్రికల్ విభాగం	
33. రఘుపతిరెడ్డి, డిప్యూటీ ఈఈ	9121245035
వెటర్నరీ విభాగం	
34. డాక్టర్ నాగార్జున, వీఓ	9000961962
యూబీడీ విభాగం	
35. విజయరాణి, మేనేజర్	9848904760
36. శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్	9989670899
37. పూజిత, ఫీల్డ్ అసిస్టెంట్	7981399348
38. వినేష్, ఫీల్డ్ అసిస్టెంట్	9542487369
39. రాజు, ఫీల్డ్ అసిస్టెంట్	7660069205
ఎంటమాలజీ విభాగం	
40. అరుణ్-ఏఈ	9515660479

ప్రభుత్వ భూమిని కాపాడాలి : బీజేపీ

- ఆకుల సతీష్ వినతి

నిజాంపేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామంలోని సర్వే నంబరు 306, 294ల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ బాచుపల్లి మండలం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ వినపత్రం సమర్పించారు. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్న వాటిని నిలిపివేయడంతో పాటు, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని, భూకబ్జా కేసులు నమోదు చేయాలని ఆయన తహశీల్దార్‌ను డిమాండ్ చేశారు.

దళారులను నమ్మి భూములను కొనుగోలు చేయవద్దు

- దుండిగల్ మండల తహసీల్దార్

దుండిగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఎవరూ కూడా దళారులను నమ్మి భూములను కొనుగోలు చేయవద్దని, అలాగే చెరువుల అంచులో ప్లాట్లను కొనేముందు ఇరిగేషన్ ఎన్‌ఓసీ చూసుకోవాలని గండి మైసమ్మ, దుండిగల్ మండల తహసీల్దార్ మతిన్ సూచించారు. ప్లాట్లను కొనే ముందు రెవెన్యూ, ఇరిగేషన్, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలని కోరారు. అదేవిధంగా గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 58, 59 జీఓల కింద పట్టాలు పొందినవారు, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి, సంబంధిత మున్సిపాలిటీల్లో నివాసాలు నిర్మించుకోవడానికి అనుమతి లభిస్తుందన్నారు. అలాగే రెండు వందల గజాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు టీఎస్‌బీ పాస్ కింద దరఖాస్తు చేసుకుంటే అధికారులు అనుమతులు ఇస్తారని సూచించారు. అదేవిధంగా 58 కింద దరఖాస్తు చేసుకొని, నివాసాలు ఉండి, అధికారుల పరిశీలన తర్వాత పట్టాలు పొందినవారు ఇళ్ల నిర్మాణానికి అర్హులేనని తెలిపారు. గండిమైసమ్మ, దుండిగల్ మండల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఏళ్లతరబడి నివాసాలు నిర్మించుకొని, పై జీవోల కింద రెగ్యులరైజ్ చేయించుకున్న వారు అధికంగానే ఉన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే, కనీస సమాచారం ఇవ్వకుండానే కూల్చివేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ఉపయోగకరంగా ఉంటుందని తహశీల్దార్ అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఎవరైనా చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే మాకు సమాచారం ఈ సందర్భంగా తెలియజేశారు.



దుండిగల్ మండల తహశీల్దార్ మతిన్

నిత్య జీవితాన్ని ఆనందమయం చేసేది సైన్స్



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి విజయ కుమారి

- మేడ్చల్ జిల్లా విద్యాధికారి

దుండిగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితాన్ని ఆనందమయం చేసేది సైన్స్. నిరంతరం సృజనాత్మకంగా ఆలోచించి, సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. చర్చి గాగిల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండురోజుల పాటు జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, విద్యా శాఖాధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు.

అనంతరం విద్యార్థిని, విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన పలురకాల ప్రాజెక్టులు ఆలోచింప చేసే విధంగా ఉన్నాయన్నారు.

ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న 24 మంది విద్యార్థులకు మొదటి, రెండవ, తృతీయ బహుమతులు అందించారు. మొదటి 8 మందిని సెలెక్ట్ చేసి సౌత్ ఇండియన్ సౌత్ ఫెస్టివల్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా సైన్స్ స్పేర్ జిల్లాస్థాయి నుంచి 10 శాతం మంది అంటే 17 మందిని రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు విద్యాశాఖాధికారి వెల్లడించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి రవీందర్‌రాజు, స్థానిక మండల విద్యా ధికారి కృష్ణ, కుత్బుల్లాపూర్ ఎంఎల్‌ఓ రమేష్, అన్ని మండలాల విద్యాధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాయుసేన ఉద్యోగాలపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గురు ప్రీతి

పేట్‌బషీరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని సెయింట్ ఆంథోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భారతదేశ డిఫెన్స్ వాయు రింగ్ కమాండర్ గురు ప్రీతి హాజరై వాయుసేన గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాయుసేనలో చేరడానికి కనీస అర్హతలు, అగ్నిపత్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాయుసేనలో చేరడానికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సీహెచ్ ప్రభాకర్, వాయువింగ్ కమాండర్ సందీప్, ప్రొఫెసర్ విన్సంట్, కళాశాల డైరెక్టర్ సుందరరాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు సన్మానం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును సన్మానించిన తెలంగాణ కమ్మ సేవాసంఘం సభ్యులు

దుండిగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీటీడీ చైర్మన్‌గా ఎన్నికైన బీఆర్ నాయుడును శుక్రవారం కమ్మ సేవాసంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సభ్యులు కలిసి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కమ్మ సంఘాల సమైఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవి శంకరరావు, శివరామ కృష్ణప్రసాద్, రత్నాకర్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావులతో పాటు కమ్మ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో నమ్మించి మోసం చేసిన ఆర్‌జే సంస్థపై తగిన చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరుతూ బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులు ప్రముఖులతో ప్రకటనలు ఇప్పించడంతో నారాయణ్‌ఖేడ్, ఘట్‌కేసర్, పఠాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఫామ్‌ల్యాండ్‌లను కొన్నామని తెలిపారు. సుమారు 600 మంది నుంచి రూ.150 కోట్లను నిర్వాహకులు వసూలు చేశారని ఆరోపించారు. 2020లో ఒక్కొక్కరం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కట్టామని, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని ఆరోపించారు. వెంచర్ ఎండీ భాస్కర్‌గుప్తా, డైరెక్టర్ సుధారాణిలను తాము ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారని, అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. ఈ విషయమై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆర్‌జే సంస్థ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

మియాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మంజునాథ్ వైన్స్ వద్ద ఈ నెల 19న రాత్రి గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సన్నాహక సంబురాలు

దుండిగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం ప్రాంతంలో ఉన్న సిటీ ప్యాలెస్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి మొదటి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా సన్నాహక సంబురాలు జరుగుతాయని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంబురాలకు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు; యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు; ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ నాయకులు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాలని హన్మంత్‌రెడ్డి కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు

- ఏసీపీ హన్మంతరావు

కుత్బుల్లాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాలేజీల్లో ర్యాంగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు అన్నారు. శుక్రవారం చింతల్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఉన్నత స్థానాలకు వెళ్లాన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డీఐ కనకయ్య, ఎస్ఐ నాయుడు, హరీష్, సత్యనారాయణ, కళాశాల యాజమాన్యం నల్లా జయశంకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ హన్మంతరావు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పన కోసం తమవంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పలు కాలనీ సంఘాల అసోసియేషన్ సభ్యులు, ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజలందరికీ మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో 30 మంది పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పదో తరగతి ఫీజులకు 6వేల రూపాయాలను అందించిన అంబేద్కర్ సేవాసమితి. కార్యక్రమంలో వీరయ్య, గోడి పరశురాముడు, నవీన్, కుమార్, మల్లేష్, అశోక్ పాల్గొన్నారు.

\- జీడిమెట్ల(ఆంధ్రజ్యోతి)

దేశం క్రీడల్లో వెనకబడడం శోచనీయం : వీసీ ప్రొ.జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అధిక జనాభా ఉన్న భారతదేశం క్రీడల్లో వెనకబడి ఉండడం శోచనీయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 11 కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్లుగా బాల బాలికల విభాగంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నిలిచింది. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో బాలురు, బాలికల విభాగంలో అశ్వారావుపేటకు చెందిన కె.అనిల్‌కుమార్, ఎం.రచన చాంపియన్లుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విద్యావిధానాలు క్రీడల ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నప్పటికీ తగిన ఆచరణ ఉండడం లేదన్నారు. ప్రభుత్వం కొత్తగా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు. క్రీడలవల్ల విద్యార్థుల్లో ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, వర్సిటీ అబ్జర్వర్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జె.సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి, డాక్టర్ ప్రశాంత్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్లుగా నిలిచిన రాజేంద్రనగర్ వ్యవసాయకళాశాల విద్యార్థులతో వీసీ ప్రొ.జానయ్య